సాక్షి ప్రకాశం

సోమవారం, 30, సెప్టెంబర్, 2024



వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

వ్యవసాయ కూలీల ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడి 15 మందికి గాయాలైన ఘటన ఆదివారం మర్రిపూడి మండలం జీఅగ్రహారంవద్ద జరిగింది.

- 8లో..



పని దొరకక..పూట గడవక..

ఇసుక కొరతతో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పనులు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35.7/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

30 వేల హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటు లక్ష్యం

● మైక్రో ఇరిగేషన్ పీడీ వెంకట రమణ



మాట్లాడుతున్న వెంకట రమణ

మార్కాపురం: ఈ ఏడాది జిల్లాలో 30 వేల హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ చెప్పారు. ఆదివారం పట్టణంలోని ద్వాక్రా బజారులో డ్రిప్ ఇరిగేషన్ డీలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతులు ఐదెకరాలు లోపు ఉన్న వారికి 90 శాతం సబ్సిడీ, 5–10 ఎకరాలు లోపు ఉన్నవారికి 70 శాతం సబ్సిడీ ఇస్తామని అన్నారు. స్ప్రింకర్లు అయితే 5 ఎకరాల లోపు రైతులకు 55 శాతం, పదెకరాలలోపు రైతులకు 45 శాతం సబ్సిడీ ఉంటుందని అన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 1207 మంది రైతులకు 1352 హెక్టార్లలో డ్రిప్ బిగించామని చెప్పారు. కావాల్సిన రైతులు దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి లాండ్ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులతో నమోదు చేసుకోవాలని, అప్పుడు సెల్‌ఫోన్‌కు మేసేజ్ వస్తుందని, నచ్చిన కంపెనీని ఎంచుకుని డిజిటల్ పేమెంట్ ద్వారా డ్రిప్ సౌకర్యం పొందవచ్చన్నారు. దాదాపు 25 డ్రిప్ కంపెనీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, రైతులు తమకు నచ్చిన కంపెనీని ఎంచుకోవచ్చన్నారు. వరి తప్ప మిగతా పంటలకు డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. దీనివలన 30 శాతం దిగుబడి పెరుగుతుందని, 35 శాతం ఖర్చు తగ్గుతుందని, 40 శాతం కరెంటు ఆదా అవుతుందని ఆయన తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ వర్గీయుల దౌర్జన్యం

● ఇంటి ప్రహరీ పిల్లర్ కూల్చివేత



ప్రహరీ పిల్లర్‌ను కాలుతో పడేస్తున్న టీడీపీ కార్యకర్త పోకూరి వెంకటేశ్వర్లు

మర్రిపూడి: మండలంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై మంత్రి స్వామి అండదండలతో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యాలకు దిగుతున్నారు. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని రామాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు జొన్నలగడ్డ సురేష్ ఇల్లు కట్టి ప్రహరీ నిర్మించుకుంటున్నాడు. ప్రహరీ కోసం ప్రధాన రహదారికి సుమారు 9 అడుగుల దూరంలో తన సొంత స్థలంలో పిల్లర్ వేసుకున్నాడు. ఆదివారం ఇది నచ్చని తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడైన పోకూరి వెంకటేశ్వర్లు ఇక్కడ సైడ్‌కాలువ కట్టాలి ఎందుకు పిల్లర్ వేశావు? నీకు ఎంత ధైర్యం రా అంటూ సురేష్, అతని భార్య ధనలక్ష్మిలపై దౌర్జన్యానికి దిగి నానా దుర్భాషలాడి కాలుతో పదేపదే తన్ని మరీ పిల్లర్‌ను కూల్చివేశాడు. తన్నురా ఎవరు అడ్డువస్తారో చూద్దాం.. అని మరికొందరు టీడీపీ సానుభూతి పరులు యర్రమోతు కోటేశ్వరరావు, వై శ్రీను, వెంకటేశ్వర్లు, పోకూరి కొండలు అందరూ కలిసి సురేష్ కుటుంబీకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. మాట్లాడితే ఇల్లు కూడా పడవేస్తాం, నీఇష్టం అని నానా దుర్భాషలాడి బెదిరించారు. మంత్రి స్వామి అండతో మా పై దౌర్జన్యానికి వస్తున్నారని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు బాధితులు జొన్నలడ్డ సురేష్, ధనలక్ష్మి వాపోయారు.

టైగర్ ఫోర్స్..!

నల్లమలలో పులుల సంరక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అటవీ ప్రాంతంలోని మార్కాపురం, ఆత్మకూరు, గిద్దలూరు, నంద్యాల పరిధిలో ఉన్న సుమారు 100కుపైగా పెద్దపులుల రక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయనుంది. అందుకు సంబంధించి స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌టీపీఎఫ్) వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలను అటవీశాఖ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఈ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

- పులుల సంరక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి
- త్వరలో స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు
- సిబ్బందికి గ్రేహౌండ్స్ తరహా శిక్షణ
- ఇప్పటికే 17 మందికి ఆయుధాలు అందజేత



మార్కాపురం: నల్లమల అభయారణ్యంలోని పులుల సంరక్షణకు అటవీ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు సన్నద్ధమవుతోంది. నల్లమల పరిధిలోని 4 అటవీశాఖ డివిజన్లకు ప్రస్తుతం డీఎఫ్ఓ స్థాయి అధికారులు ఉన్నారు. మార్కాపురం అటవీశాఖను డిప్యూటీ డైరెక్టర్ హోదా అధికారి పర్యవేక్షిస్తున్నారు. వీరి పరిధిలో డీఆర్‌ఓలు, రేంజ్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, గార్డులు, వీరితో పాటు ప్రత్యేక బృందాలు పులుల సంరక్షణ కోసం పనిచేస్తున్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, మాచర్ల, నాగార్జునసాగర్ ప్రాంతాలు ఉన్నాయి. వీటి పరిధిలో 88 పెద్దపులులు ఉన్నాయి. మన రాష్ట్రంలో ఏకైక టైగర్ రిజర్వు అయిన నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు 5360.22 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుగా గుర్తింపు పొందింది.

నల్లమలకు ప్రత్యేక గుర్తింపు...

ప్రత్యేక పర్యావరణ వ్యవస్థ, సహజ సిద్ధమైన గొప్ప జీవ వైవిధ్యాల ప్రాంతంగా నల్లమలకు గుర్తింపు వచ్చింది. నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణానది సుమారు 200 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టు (ఎన్ఎస్‌టీఆర్)లో 88 పెద్దపులులు ఉన్నాయి. పెద్దపులులు దక్షిణాది వైపు సంచరిస్తూ శేషాచలం బయోస్ఫియర్ రిజర్వులో తమ ఆవాసాలను ఏర్పరచుకున్నాయి. వన్యప్రాణుల వేటను నిరోధించేందుకు వన్యప్రాణి వేట నిరోధక శిబిరాలు (యాంటీ పోచింగ్ క్యాంప్) ఏర్పాటు చేసి 800 మందికిపైగా చెంచు గిరిజనులను సంరక్షకులుగా, స్వచ్ఛ సేవకులుగా చెక్‌పోస్టులో, అటవీ ప్రాంతాల్లో నియమించారు. పులుల పరిరక్షణలో వీరంతా కీలకంగా వ్యవహరిస్తున్నారు. శ్రీ లంకామల్లేశ్వరా వన్యప్రాణి అభయారణ్యం, శ్రీ పెంచల నరసింహ వన్యప్రాణుల అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం పులుల సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ మూడు ప్రాంతాలు సుమారు 9335.78 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి భవిష్యత్తులో పులులు తమ ఆవాసాలను ఏర్పరుచుకునే వాతావరణానికి అనుకూల పరిస్థితులు కలిగి ఉన్నాయి.

85 బేస్ క్యాంపులు.. 88 పెద్ద పులులు:

నల్లమలలో ఇప్పటికే 85 బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 2022లో దాదాపు 73 పెద్ద పులులు ఉండగా, గతేడాది ఈ సంఖ్య 80కి పెరిగింది. ఈ సంవత్సరం 88కి చేరింది. పులుల సంరక్షణకు తీసుకునే చర్యల వలన పులుల సంఖ్య పెరగడం విశేషం. గత మూడేళ్లుగా అటవీ ప్రాంతంలో గడ్డి పెంపకం వలన పొదలు ఏర్పడ్డాయి. జింకలు, దుప్పుల సంఖ్య పెరిగింది. వీటి వలన పెద్దపులుల సంఖ్య కూడా పెరిగింది. కాగా, 15 పులిపిల్లలు కూడా అడవిలో పెరుగుతున్నట్లు అటవీ ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. వీటిని టైగర్ కప్స్ అంటారు.

గ్రేహౌండ్ శిక్షణ...

పులుల సంరక్షణ కోసం సిబ్బందికి గ్రేహౌండ్ తరహాలో కఠినమైన శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో పాటు షార్ట్ వెపన్స్, ఎస్ఎల్ఆర్, ఏకే 47 తదితర అత్యాధునిక ఆయుధాల వాడకంపై కూడా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం 17 మంది సిబ్బందికి ఆయుధాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్సు ఏర్పాటుకు ఆమోదం రాగానే, ఆయుధాల వాడకంపై తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సిబ్బందిని శిక్షణకు పంపనున్నారు.



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులులు

సీసీ కెమెరాల ద్వారా పెద్దపులుల కదలికల పరిశీలన...

అటవీ ప్రాంతంలో ఉన్న టైగర్ వాచర్స్ నిరంతరం అడవిలో తిరుగుతూ పులుల సంరక్షణపై దృష్టి పెట్టి వాటి కదలికలను ట్రాక్ చేస్తారు. సీసీ కెమెరాల ద్వారా పెద్దపులుల కదలికలను పరిశీలిస్తుంటారు. పులుల సంరక్షణ కోసం బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, నారుతడికల, పాలుట్ల, ఇష్టకామేశ్వరి, దొరబైలు, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, చిన మంతనాల, రోళ్లపెంట, కొర్రపోలు, తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. వీటిలో అటవీశాఖ సిబ్బంది ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక, రాత్రిపూట శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను దోర్నాల చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 గంటలకే నిలిపి వేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను కూడా ఈగలపెంట వద్ద అక్కడి చెక్‌పోస్టు సిబ్బంది 9 గంటలకు నిలిపేస్తున్నారు. ఇలా చేయటం వలన రాత్రిపూట పెద్దపులులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. దీనితో పాటు పులులకు మరింత రక్షణ కల్పించేందుకు స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌టీపీఎఫ్) వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలను అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఈ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

మా వాళ్లే ఉండాలి..!

- ఇన్‌లిస్ట్..అవుట్ లిస్ట్ పేరుతో బదిలీల్లో ఎమ్మెల్యే దామచర్ల పెత్తనం
- ఉద్యోగ సంఘాల హక్కులను కాలరాస్తున్న కూటమి నాయకులు
- కూటమి నేతలకు జై కొడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ
- బదిలీలకు జెడ్పీ ఛైర్మన్ కాంపిటెంట్ అథారిటీ అయినా కూటమి నేతల దౌర్జన్యాలు
- వైఎస్సార్ సీపీ ముద్ర పడిన ఉద్యోగులంటూ రెండు, మూడు బదిలీ ఉత్తర్వులు ఇస్తున్న వైనం
- సీఈవో సంతకాలు లేకుండా బదిలీ ఉత్తర్వులు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని కలెక్టర్



ఒంగోలు అర్బన్: నిర్దేశించిన ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23వ తేదీతో బ్యాన్ విధించింది. అయినా ఇప్పటికీ జిల్లా పరిషత్ కార్యాలయంలో మాత్రం పాత తేదీలతో బదిలీ ఉత్తర్వులు ఇస్తూనే ఉన్నారు. ఒక ఉద్యోగికి ఒక సారి కాదు, రెండు సార్లు కాదు.. మూడు, నాలుగు సార్లు కూడా బదిలీ ఉత్తర్వులు మార్చి మార్చి ఇస్తున్నారంటే అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. కూటమి నాయకులు ముఖ్యంగా టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు జిల్లా పరిషత్ బదిలీల్లో ×అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో₹ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిషత్‌లో బదిలీలకు సంబంధించి కాంపిటెంట్ అథారిటీ జెడ్పీ ఛైర్మన్ అని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అయితే సదరు టీడీపీ నాయకులకు మాత్రం అవేమీ పట్టడం లేదు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మరో అడుగు ముందుకేసి తన నియోజకవర్గంలో ఎవరు ఉండాలి ఎవరు ఉండకూడదంటూ ఇన్ లిస్ట్... అవుట్ లిస్టును తయారు చేసి ఆయన అనుచరులను జెడ్పీ కార్యాలయంలో ఉంచి బదిలీలను శాసిస్తున్నారు.

ఒకే ఉద్యోగికి మూడు, నాలుగు బదిలీ ఉత్తర్వులు..

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారెవరూ తన నియోజకవర్గంలో ఉండకూడదంటూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల హుకుం జారీ చేశారు. దీంతో జెడ్పీ ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఉద్యోగులకు పార్టీ ముద్ర, కులాల ముద్ర వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సీనియారిటీ, లాంగ్‌స్టాండింగ్ వంటి ప్రమాణాలు కూడా పాటించకుండా ఇష్టారాజ్యంగా బదిలీలు చేస్తున్నారంటూ వాపోతున్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓకు ఏదో ఒక కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లేదా డ్వామా పీడీగా నియమిస్తామని టీడీపీ నేతలు భరోసా ఇవ్వడంతో ఇక ఆయన అరాచకాలకు అడ్డులేకుండా పోతోంది. ఒక ఉద్యోగికి గిద్దలూరు, ఆ తర్వాత అద్దంకి ఆపై మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అదే విధంగా మరో ఉద్యోగికి మొదటి ఉత్తర్వులు పుల్లలచెరువు, ఆ తర్వాత త్రిపురాంతకం... మరో ఉద్యోగికి తొలుత యర్రగొండపాలెం ఆ తర్వాత పుల్లలచెరువుకు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అంది బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లి జాయిన్ అయిన ఉద్యోగులను కూడా వదలకుండా మళ్లీ బదిలీ చేయడంపై ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ సీఈఓ కానీ, డిప్యూటీ సీఈఓ కానీ సంతకాలు చేయకుండా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. కేవలం వైఎస్సార్ సీపీ ముద్ర వేసి ఉద్యోగులను ఈ రకంగా బదిలీ చేయడం దారుణమంటున్నారు. కనీసం స్పౌజ్ కోటాలో కూడా న్యాయం చేయకుండా జెడ్పీ బదిలీలు ఇష్టారాజ్యంగా చేయడం అమానుషం అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరకు ఉద్యోగ సంఘాల హక్కులను కూడా టీడీపీ నేతలు కాలరాస్తున్నారు. గుర్తింపు ఉన్న ఉద్యోగ సంఘాల నేతలకు ఆఫీస్ బ్యారర్ కింద మినహాయింపు పొందే అవకాశం ప్రభుత్వమే కల్పిస్తుంది. అయితే జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల దౌర్జన్యాలకు ఉద్యోగ సంఘాల నేతలకు సైతం అన్యాయం జరుగుతోంది. వీరికి సంబంధించి బదిలీల్లో మినహాయింపు పొందేందుకు అవసరమైన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అనుమతులిచ్చినా జెడ్పీ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. కేవలం టీడీపీ నేతలకు వత్తాసు పలకడం విస్మయానికి గురి చేస్తోందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇంత రచ్చ జరుగుతున్నా కలెక్టర్ కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందంటూ జెడ్పీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జెడ్పీ బదిలీల్లో జోక్యం చేసుకుని అక్రమాలను అరికట్టాలని ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మరో పక్క అన్యాయం జరిగిన ఉద్యోగులు కోర్టును ఆశ్రయించే పనిలో పడ్డారు. గత 20, 30 ఏళ్లుగా జెడ్పీలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఇటువంటి బదిలీలు ఇప్పటి వరకు చూడలేదంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

జీవితానికి హాస్యం టానిక్

● ప్రరసం జిల్లా అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసరావు



పొన్నూరు శ్రీనివాసుని సన్మానిస్తున్న చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: హాస్యం మానవ జీవితానికి టానిక్‌లా పనిచేస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'తెలుగు సాహిత్యంలో హాస్యం' అన్న అంశంపై ప్రసంగించారు. సభకు ఏపీ జెన్‌కో డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. భారతీయ భాషల్లో తెలుగు సాహిత్యంలో హాస్యం పండించిన రచయితలు అనేకం మంది ఉన్నారని పొన్నూరు వెంకట శ్రీనివాసులు తెలిపారు. తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో హాస్య, వ్యంగ్య కవితలు, పద్యాలు వినిపించారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశమ్, కార్యవర్గ సభ్యుడు, వీ.ఆర్.కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం నిర్వహణలో నిర్వహించిన కార్యక్రమంలో వక్త శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్య నాయుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, కవి రాచపాలెం రఘు, వై.విశ్వనాథం, చేజర్ల వినయ, పి.వి. సుబ్రమణ్యం, బృందావనరావు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పగలు..రేయి ఇసుక దోపిడీ

కొండపి (సింగరాయకొండ): తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్నట్లుగా ముసి నదిలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొండపి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో పగలు, రేయి తేడా లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఎంత తవ్వినా అడిగేవారు లేకపోవడంతో ఇసుకదందా సాగిపోతోంది. ముసి వాగు, అట్లేరు పరివాహక ప్రాంతాలను ఆనుకొని ఉన్న కొంతమంది అధికార పార్టీ నేతలు ఈ ఇసుక దందా సాగిస్తున్నారు.

ట్రక్కు ఇసుక రూ.3 వేలు

ముసి పరివాహక ప్రాంతం అట్లేరులో బిల్లులు లేకుండా తరలిస్తున్న ఇసుకను ప్రదేశాన్ని బట్టి టన్ను రూ.750 చొప్పున ట్రాక్టరు ట్రక్కు రూ.3 వేలకు నిత్యం వందల ట్రక్కుల ఇసుక తరలిస్తూ పెద్ద ఎత్తున జేబులు నింపుకుంటున్నారు. పట్టించుకునే వాళ్లు లేకపోవడంతో ఇసుకాసురులది ఆడిందే ఆట పాడిందే పాట అన్నచందంగా మారింది.



ముసి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పర్యావరణానికి విఘాతం

ముసి వాగులో ఇసుక అక్రమంగా తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. రైతులు బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్నాయి. ప్రవాహాలు లేకపోవడంతో బోరు బావుల్లో నీరు అడుగంటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే విధంగా కొనసాగితే ముసి వాగులో నీటి ప్రవాహాలు కూడా దారి మళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

● అఖిల భారత ధర్మజాగరణ సహ ప్రముఖ్ ఆలె శ్యాం

ఒంగోలు: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని అఖిల భారత ధర్మజాగరణ సహ ప్రముఖ్ ఆలె శ్యాం పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో సేవాభారతి ఒంగోలు శాఖ ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్మికులు, కాటికాపరుల సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాల భారతదేశం లో పారిశుద్ధ్య కార్మికులు నిత్యం సమాజానికి అందించే సేవలు వెల కట్టలేనివని స్వచ్ఛ భారత్ లో వారి పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సమాజం నిద్ర లేవక ముందే గ్రామాలు, నగరాలు, పట్టణాల్లో ఆయా ప్రాంత పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛ భారత్ సంకల్పం తో శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య, పారిశుద్ధ్య పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని వారు అభినందనీయులు అన్నారు. ఒక గంట పాటు పారిశుద్ధ్య కార్మికులు తమ దినసరి బాధ్యతలకు విశ్రాంతి ఇస్తే అప్పుడు వారి విలువ మనకి తెలుస్తుందని వారి సేవలను గౌరవించడం మానవ ధర్మం అని హితవు పలికారు. ఏకేవీకే కాలేజీ అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వారి అభివృద్ధికి సహకరించాలని పిలుపు ఇచ్చారు. సేవా భారతి ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా అఖిల భారత ధర్మ జాగరణ మంచ్ సహప్రముఖ్ ఆలేశ్యాం, ఆర్ ఎస్ ఎస్ జిల్లా సంఘ చాలక్ రాం ప్రసాద్, ఒంగోలు నగర సంఘచాలక్ బత్తిన మహేష్, రైజ్ విద్యాసంస్థలు ఛైర్మన్ ఇస్కాల చిన రంగ మన్నార్, క్విస్ విద్యా సంస్థల ఛైర్మన్ నిడమానూరి కళ్యాణ చక్రవర్తి, జిల్లా సేవా ప్రముఖ్ శేషారావు, నగర సేవా ప్రముఖ్ ఏడుకొండలు పారిశుద్ధ్య కార్మికులు, కాటికాపరులను గౌరవంగా సత్కరించారు. కార్యక్రమంలో సేవా భారతి, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులు, కాటికాపరులకు సత్కారం

సమాజంలో అసమానతలు విడనాడాలి

ఒంగోలు మెట్రో:

జాషువా సాహిత్యం సమాజంలోని అసమానతలపై ధిక్కార స్వరంగా వచ్చిందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ పిల్లి వాసు అన్నారు. ప్రముఖ ప్రజాకవి గుర్రం జాషువా 129 వ జయంతి సందర్భంగా జన సాహితి ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాషువా సాహిత్యం 'సామాజిక తాత్వికత' అనే అంశంపై ఒంగోలు తరిమెల నాగిరెడ్డి భవనంలో సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య వక్తగా పాల్గొన్న మాట్లాడుతూ జాషువా కవిత్వమే ఆయుధంగా దళిత వేదనని, కష్టజీవిని కథా నాయకుడుగా చూపించాడన్నారు. పేదరికం, కుల మత వివక్ష తన జీవితాంతం వెంటాడినా లక్ష్యసాధనలో వెనుకాడలేదని చెప్పారు. ఉద్దండ కవి సామ్రాట్లను తన సాహిత్యంతో మెప్పించాడు. జాషువా వస్తు వైవిధ్యం విశిష్టమైనది, సమకాలీనమైనది అన్నారు. మహిళా సాధికారత, శాస్త్రీయ విద్య కావాలని, మతం ముసుగులో కొనసాగే ఫాసిస్టు దోరణుల గురించి ఆనాడే జాషువా కవిత్వీకరించారని జన సాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య అన్నారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ తరాలు మారినా మానని గాయంలా మనుషులని ఇంకా వేధిస్తూనే ఉందని సభకు అధ్యక్షత వహించిన ఏసుదాసు అన్నారు. విజయ్ భాస్కర్ రెడ్డి, ఖాదర్ బాష, శ్రీనివాసులు, నూకతోటి రవికుమార్ తదితరులు మాట్లాడారు. డీవీ వెంకటేశ్వరరెడ్డి, కారుమంచి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పరిటాల సుబ్బారావు, కోటేశ్వరరావు డాక్టర్ జి.వీ.కృష్ణయ్య జనసాహితి జిల్లా అధ్యక్షుడు ఈ సభలో పాల్గొన్నారు.



సాహిత్య సామాజిక అనే అంశంపై మాట్లాడుతున్న ప్రొఫెసర్ పిల్లి వాసు

మాల ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా హనుమంతరావు

ఒంగోలు:

మాల ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా గడ్డం హనుమంతరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఎన్‌జీవో హోంలో ఆదివారం ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘ నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. దీనికి రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల విజయశేఖర్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ మాల ఉద్యోగుల శాశ్విత కమిటీ ఎన్నిక చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎంపిక జరిగింది. రాష్ట్ర కమిటీకి జిల్లా తరపున కోఆర్డినేటర్‌గా తుల్లిబిల్లి అశోక్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

నూతన కమిటీ:

జిల్లా అధ్యక్షునిగా గడ్డం హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లికురవ గోపీనాథ్, సంయుక్త కార్యదర్శిగా పాలడుగు వివేకానంద, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దమ్ము థామస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జనార్దన్, ఉపాధ్యక్షునిగా కాటుకూరి బాబూరావు, కోశాధికారిగా యరమాల మల్లికార్జునరావు, సంయుక్త కార్యదర్శిగా క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులుగా కసుకుర్తి జాలయ్య, టి.శ్రీకాంత్, పిల్లి వెంకట నారాయణ, మీడియా కోఆర్డినేటర్‌గా శాంతారావు, కసుకుర్తి మల్లికార్జునలు ఎంపికయ్యారు.

క్లుప్తంగా

రేపు మండల స్థాయి 'చెకుముకి' పోటీలు

ఒంగోలు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న పాఠశాల స్థాయి చెకుముకి పోటీల్లో వరుస మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఆ పాఠశాల జట్టుగా అక్టోబర్1న మండల, పట్టణ స్థాయి చెకుముకి పరీక్షలకు పంపాలని హెచ్ఎంలను కోరారు. వివరాలకు 9010649886, 8500232432ను సంప్రదించాలని సూచించారు.

అక్టోబర్ 27న జిల్లా స్థాయి పోటీలు

రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నవంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నారు. అంతకు ముందుగా అక్టోబర్ 27వ తేదీన జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని జేవీవీ బాధ్యులు తెలిపారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జేవీవీ చేస్తున్న కృషిలో భాగంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు.

హుబ్లీ-విజయవాడ రైలులో చోరీ

- 3.5 కేజీల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణ

దొనకొండ: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇద్దరు బంగారు వ్యాపారుల నుంచి 3.5 కేజీల బంగారం, రూ.50 వేల నగదు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే.. బంగారం వ్యాపారం చేసే చందలూరి రంగారావు, సతీష్‌లు సత్తెనపల్లి నుంచి బళ్లారికి బంగారాన్ని తీసుకువెళ్లారు. అయితే అక్కడ సరైన ధర లభించకపోవడంతో హుబ్లీ-విజయవాడ రైలులో తిరుగుప్రయాణమయ్యారు. అయితే తెల్లవారుజామున దొనకొండ వచ్చే సరికి బ్యాగ్ కనిపించకపోవడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మార్కాపురం నుంచి దొనకొండ వరకు బోగీలు వెతికినా కనిపించలేదు. అనంతరం వినుకొండ నుంచి నరసరావుపేట చేరుకొని జీఆర్పీ ఎస్సై నాయక్‌ను కలిసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అయితే నరసరావుపేట నుంచి గజ్జలకొండ వరకు మాత్రమే నరసరావుపేట జీఆర్పీ పరిధని, నంద్యాల జీఆర్పి స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

అనకాపల్లి: క్రిమిసంహారక మందు తాగి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ సంతోష్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... ప్రకాశం జిల్లా పామూరు మండలం పుట్టనాయుడుపాలెం గ్రామానికి చెందిన రామవరపు వరహ శ్రీనివాసరావు (34)కు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. ఆరు నెలల క్రితం కుటుంబ కలహాలతో విడిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం అనకాపల్లి మండలం బీఆర్టీ కాలనీలో తన అక్క రామలక్ష్మి ఇంటికి వచ్చాడు. శనివారం ఆమె బయటకు వెళ్లిన సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన ఆమె గమనించి హుటాహుటిన అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిల్లో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక సమావేశం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ, ఆర్పీ కార్యదర్శి కె.లెమ్యూల్‌రాజు, కోచ్‌లు జయలక్ష్మి, ఎ.మహేశ్వరరెడ్డి, రమణారావు, నవీన్‌కుమార్, తదితరులు పర్యవేక్షించారు. బాలుర విభాగంలో కె.రక్షణ్(ఒంగోలు), బాలికల విభాగంలో కె.అభిలాషా(ఒంగోలు), కాంపౌండ్ బాలుర విభాగంలో సీహెచ్. శ్రీసాయి చిత్రన్, కె.నీరబ్(ఒంగోలు) ఎంపికయ్యారు. విజేతలకు తహసీల్దార్ చిరంజీవి అభినందనలు తెలిపారు.

అండర్ 14 బాలురు: కె.గోవర్ధన్(ఒంగోలు), కె.ఇనోష్(ఒంగోలు), కె.వెంకట సారిష్(కందుకూరు), బి.నాగరాజు(పెద్దదోర్నాల)

అండర్ 14 బాలికలు: పి.స్రవంతి(ఒంగోలు)

అండర్ 17 బాలురు: ఎం.పెద్ద బయ్యన(యర్రగొండపాలెం), ఎం.నాగరాజు నాయక్(దోర్నాల), కె.నాగచైతన్య(దోర్నాల), డి.మల్లిఖార్జున(దోర్నాల)

పని దొరకక.. పూట గడవక..!

- ఇసుక కొరతతో ఆగిన భవన నిర్మాణాలు
- పనులు లేక అవస్థలు పడుతున్న కార్మికులు
- టీడీపీ, బీజేపీ నేతలకు గోడువెళ్లబోసుకుంటున్న వైనం



మార్కాపురంలో పని కోసం పడిగాపులు కాస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మార్కాపురం: ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లతో రోజూ ప్రకటనలు చేయిస్తూ.. ఇసుక అవసరమైన వారు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని గొప్పలు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవేవీ అమలు కావడం లేదు. ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో భవన నిర్మాణాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. మరోవైపు కూటమి నాయకులు వాగులు వంకల్లో తవ్వేసిన ఇసుకను తెగనమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు. అయితే ఆ ఇసుక భవన నిర్మాణాలకు ఏమూలకూ చాలడం లేదు. పైగా నాణ్యమైన ఇసుక కాకపోవడంతో ఇంటి నిర్మాణానికి వాడేందుకు యజమానులు సాహసించడం లేదు. సుమారు రెండు నెలల క్రితమే స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు నిండుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో అటు భవన నిర్మాణదారులతోపాటు ఆ పనిపై ఆధారపడిన కార్మికులు వేదన అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడింది.



టీడీపీ, బీజేపీ నేతలకు సమస్యను వివరిస్తున్న కార్మికులు

3 వేల గృహాలపై ప్రభావం

అయితే అనధికారికంగా గుండ్లకమ్మ నుంచి ఒక టీడీపీ నేత దర్జాగా ట్రాక్టర్ పెట్టి ఇసుకను తోలుతున్నాడు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేల వరకు విక్రయిస్తున్నాడు. పట్టణంలో సుమారు 300కు పైగా భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. డిమాండ్‌కు తగినట్లు ఇసుక లేకపోవడంతో సుమారు వెయ్యి మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు నెల రోజులకు పైగా పనులు లేక, కుటుంబాలను పోషించుకోలేక అవస్థల పాలవుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురంలో టన్ను ఇసుక రూ.1350కి లభించగా కూటమి ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.2 వేలు వెచ్చించినా దొరకని పరిస్థితి ఏర్పడింది. జగనన్న కాలనీల లబ్ధిదారులు కూడా మరో 10 రోజుల తర్వాత ఇసుక కొరతతో సతమతమయ్యే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే సుమారు 3 వేల గృహాల నిర్మాణాలు నిలిచిపోనున్నాయి.

నకనకలాడుతున్న కార్మికులు

మార్కాపురం పట్టణంలో రెండు నెలల నుంచి ఇసుక కొరతతో వేలాదిమంది కార్మికులు పనులు లేక పస్తులుంటున్నారు. మార్కాపురం పట్టణంతోపాటు సమీప గ్రామాలైన రాయవరం, బోడపాడు, నాగులవరం, దరిమడుగు, వేములకోట, చింతగుంట్ల, కోలభీమునిపాడు, నికరంపల్లి, మొద్దులపల్లి, యాచవరం, సీతానాగులవరం తదితర గ్రామాల నుంచి వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండ్ వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకుంటారు. మేస్త్రీలు అక్కడికి వచ్చి పనులకు తీసుకెళ్తుంటారు. నెల రోజులకు పైగా ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో పనులు లేక 10 గంటలకల్లా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. ప్రభుత్వ వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని పలువురు కార్మికులు చెబుతున్నారు. ఉచిత ఇసుక అంటే అందుబాటులో ఉండి పనులు ఉంటాయని ఆశిస్తే పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మార్కాపురం ప్రాంతంలో పలకల గనుల్లో కూడా పనులు లేకపోవడంతో అక్కడ పనిచేసే కార్మికులందరూ భవన నిర్మాణ పనులకు వెళ్లడం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక కొరత ఏర్పడటంతో గనుల కార్మికుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది.

కూటమి నేతలకు విజ్ఞప్తి

ఇసుక కొరతను తీర్చి తమకు పనులు కల్పించాలని మార్కాపురంలో భవన నిర్మాణ కార్మికులు ఎమ్మెల్యే కందుల సోదరుడు రామిరెడ్డిని, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావును రెండు రోజుల క్రితం కలిసి విన్నవించారు. ఇసుక కొరత వల్ల పనులు లేక కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని వివరించారు.

వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

- 15 మందికి గాయాలు
- ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీ రుష్మిత



గాయాలైన కూలీలను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

మర్రిపూడి: వ్యవసాయకూలీల ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడి 15 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జి.అగ్రహారం సమీపంలో ఆదివారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు చీమకుర్తి మండలం కంభంపాడు గ్రామానికి సజ్జ పంట కోతకు ట్రాక్టర్‌లో వచ్చారు. కోత పూర్తయిన తరువాత తిరిగి వెళుతుండగా మండలంలోని జి.అగ్రహారం గ్రామ సమీపంలోకి రాగానే గేదెను తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు కాగా 11 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్వల్ప గాయాలైన వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన నలుగురు క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులంతా కాటూరివారిపాలెం గ్రామస్తులుగా గుర్తించారు.



ఆస్పత్రి బయట గుమిగూడి ఉన్న క్షతగాత్రుల బంధువులు



పొదిలి వైద్యశాల చికిత్స పొందుతున్న సుస్మిత

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి

గిద్దలూరు రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన నగర పంచాయతీ పరిధిలోని పీఆర్ కాలనీ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..జంగా మాధవరెడ్డి నగర పంచాయతీలో వాటర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన చిన్నకుమారుడు నిరంజన్(11)ను పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. తన తండ్రి రోడ్డు పక్కన మూత్రవిసర్జనకు వెళ్లిన సమయంలో బాలుడిని ముండ్లపాడుకు చెందిన ఆర్మీ జవాన్ ద్విచక్రవాహనంపై వెళుతూ ఢీకొట్టాడు. ప్రమాదంలో నిరంజన్‌కు తీవ్ర గాయాలు కావడంతో తొలుత ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.



నిరంజన్‌రెడ్డి మృతదేహం

కాగా బాలుడు మరణానికి వైద్యులను బాధ్యులను చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి చికిత్స నిమిత్తం బాలుడిని వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడం చాలా బాధాకరమని, ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ మంత్రిని కోరనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయునికి అక్కినేని ప్రతిభా పురస్కారం

కనిగిరి రూరల్: మండలంలోని కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న మతుకుమల్లి మనోహర్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్, నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు మీడియా ఎక్సలెన్సీ పురస్కారం లభించింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రుతి లయ ఆర్ట్ అకాడమీ, ఆదర్శ, ఆర్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అక్కినేని శతజయంతి ఉత్సవాల్లో ఈ అవార్డును అందచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి చేతుల మీదుగా ఈ ఆవార్డును అందుకున్నట్లు తెలిపారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేస్తున్న మనోహర్ గతంలో హైదరాబాద్‌లో సీనియర్ పాత్రికేయుడిగా పనిచేశారు. అవార్డు అందుకున్న మతుకుమల్లి మనోహర్‌ను పలువురు ప్రముఖులు ఆదివారం అభినందించారు.



అవార్డును అందుకుంటున్న టీచర్ మతుకుమల్లి మనోహర్

క్షేమంగా ఇంటికి చేరిన చిన్నారి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద దారి తప్పి దిక్కు తోచకుండా ఉన్న చిన్నారిని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన పాశం ఏడుకొండలు, పాశం దీపికల మూడేళ్ల కుమార్తె తల్లిదండ్రుల నుండి తప్పి పోయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద దారి తెలియక రోదిస్తూ ఉంది. దీంతో చిన్నారిని గమనించిన స్థానికులు తల్లిదండ్రుల వివరాలను అడిగి చూడగా సమాధానం చెప్పలేకపోయింది. దీంతో వారు చిన్నారిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై మహేష్ సిబ్బంది, మీడియా సహాయంలో తల్లి దండ్రుల వివరాలు తెలుసుకొని బాలికను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. దీంతో బిడ్డ కనిపించక దుఖంలో ఉన్న బాలిక తల్లిదండ్రులు చిన్నారిని దగ్గరకు చేర్చిన పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పోలీసులు సహాయంలో తల్లిదండ్రుల వద్దకు చేరిన చిన్నారి

పైపులైన్ నిర్మాణ పనుల అడ్డగింత

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడులో బీపీసీఎల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణ పనులను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు అడ్డుకున్నారు. మైనంపాడులో పైపులైన్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. 16 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణానికి రైతుల నుంచి కావాల్సిన భూమికి పరిహారం చెల్లించకుండా బీపీసీఎల్ కంపెనీ వారు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాలో రైతులు సాగు చేసుకున్న పంటతో పాటు భూమికి పరిహారం చెల్లించి పైపులైన్‌లు నిర్మిస్తుంటే మన జిల్లాలో మాత్రం బీపీసీఎల్ వారు ఎలాంటి పరిహారం చెల్లించకుండా పైపులైన్ నిర్మించుకున్న తర్వాత దానిపై వ్యవసాయం చేసుకోవచ్చని మభ్యపెట్టే మాటలు చెబుతుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు కిలారి పెద్దబ్బాయి. పమిడి వెంకట్రావు, అన్నం సుబ్బారావు, హనుమంతురావు, అంజయ్య పాల్గొన్నారు.



పనులను అడ్డుకున్న రైతు సంఘ నాయకులు

'సిగరెట్' గొడవ ముదిరి వ్యక్తిపై దాడి



గాయపడిన బాలచంద్ర

ఒంగోలు టౌన్: టీ కొట్టు దగ్గర సిగరెట్ కోసం జరిగిన వాదన ఘర్షణ దాకా వెళ్లింది. బాధితుడి కథనం ప్రకారం .. నగరంలోని కమ్మపాలేనికి చెందిన చిమటా బాలచంద్ర కొత్తపట్నం బస్టాండ్ సెంటర్లో అన్నా క్యాంటీన్ ఎదురుగా కన్నా డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తుంటారు. అదే సెంటర్లోని డైమండ్ టీ స్టాల్లో తరచూ టీ తాగేందుకు వెళ్తుంటారు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో టీ తాగేందుకు వెళ్లారు. షాపులో ఉన్న యువకుడిని సిగరెట్ ఇవ్వాలని అడగ్గా లేదని బదులిచ్చాడు. దాంతో సరదాగా ఎప్పుడు అడిగినా సిగరెట్ లేదని చెబుతావేమిటంటూ కామెంట్ చేశాడు. అక్కడే ఉన్న టీ స్టాల్ నిర్వాహకుడు, సత్యనారాయణపురానికి చెందిన మన్నెం సునీల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. స్థానికులు కలుగజేసుకుని ఆ ఇద్దరినీ సముదాయించి పంపించారు. కాసేపటి తర్వాత రైతు బజారు కార్ స్టాండ్ వద్ద నిల్చుని ఫోన్లో మాట్లాడుతున్న బాలచంద్రపై 10 మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. కింద పడేసి ఇష్టం వచ్చినట్లు చితకబాదారు. ఈ దాడిలో బాలచంద్ర తల, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ శ్రేణులు మూక దాడికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తొలుత ఇరువర్గాల మధ్య దాడి జరిగిందని, ఈ క్రమంలోనే ఒక వర్గం బాలచంద్రపై దాడి చేసిందని సీఐ చెప్పారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ఒంగోలు టౌన్: సహజీవనం చేస్తున్న యువకుడితో విభేదాలతో మహిళ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని అంబేడ్కర్ భవనం వద్ద పి. సుప్రజ (28) అనే మహిళ నివసిస్తుంది. 13 ఏళ్ల క్రితం ఆమెకు రవితో వివాహమైంది. ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే భర్త రవితో విభేదాలతో పిల్లలతో ఒంటరిగా జీవిస్తుంది. ఆ తరువాత మున్నంగి నరేంద్ర అనే వ్యక్తితో పరిచయమై అతడితో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య వివాదం జరిగింది. మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లిన సుప్రజ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం గమనించిన పిల్లలు చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘ ఎన్నిక ఏకగ్రీవం

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాలూ నాయక్, ప్రసాదరావు

ఒంగోలు సబర్బన్: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ 60 ఏళ్ల డైమండ్ జూబ్లీ సంబరాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంసీహెచ్ బాలూనాయక్, జె.ప్రసాద రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఇండ్ల సాంబశివ రావు, ట్రెజరర్‌గా ఇండ్ల ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ ఈ.శ్రీనివాసరావు, నాగయ్య, మల్లు నాయక్, వైస్ ప్రెసిడెంట్లుగా బి.శ్రీనివాస నాయక్, భూమని మస్తాన్, డి.వెంకట్రావు, కాంతారావు, ఐ.వెంకటేశ్వర్లు, దాసరి గంగయ్య, జాయింట్ సెక్రటరీలుగా ఎం.రమణ నాయక్, బి.బాపూజీ, డి.సాల్మన్ రాజు, ఎం.అరుణా శింగ్ నాయక్, మూగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.నాగేశ్వర రావు, రమావత్ శ్రీనివాస నాయక్, బి.రాణిబాయ్, కె.కిషోర్ నాయక్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ బి.లక్ష్మా నాయక్, కె.సురేష్, బి.చక్రి నాయక్, కె.ప్రసాద రావు, డాక్టర్ అరుణ్ కుమార్, పాలపర్తి వెంకటేశ్వర్లు, కమిటీ మెంబర్లుగా డి.శ్రీనివాస నాయక్, భూమని వెంకటేష్, కొమరగిరి రాజారావు, ఇట్లా రామచంద్ర రావు, రాము నాయక్, మహిళా సంయుక్త కార్యదర్శులుగా ఫాతిమాబాయ్, మల్లవరపు రవణమ్మ, శ్రీరామ రవణమ్మ, అంగోతు కుమారి ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు.

భవనంపై కూలిన పిట్టగోడ

- త్రుటిలో తప్పిన ప్రమాదం

రాచర్ల: మిద్దెపై పిట్టగోడ కూలిన సంఘటన మండల కేంద్రమైన రాచర్లలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన హోటల్ రాజుకు చెందిన భవనంపై ముందు భాగంలోని గోడకు ఉన్న ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోవడంతో ఆదివారం మధ్యాహ్నం సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



రాచర్ల : భవనంపై కూలిన గోడ

మార్కాపురంలో శ్రీసిటీ వెంచర్ ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల, గల్లా రామచంద్రరావు తదితరులు

మార్కాపురం: రియల్ ఎస్టేట్ రంగంలో వినూత్నమైన ఆలోచనలతో గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మార్కాపురంలో శ్రీసిటీ పేరుతో వెంచర్ ఏర్పాటు చేయడం అభినందనీయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సిటీ ప్రాజెక్టు బ్రోచర్‌ను సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజలకు విలాసవంతమైన జీవనశైలిని అందించేందుకు రియాల్టీ నిర్మాణ రంగంలో అత్యాధునిక పోకడలతో శ్రీ భ్రమర టౌన్‌షిప్ శరవేగంగా దూసుకెళ్తోందని అన్నారు. శ్రీ సిటీ మార్కాపురంలో విల్లా ప్లాట్స్, కమర్షియల్ ప్లాట్స్, సింప్లెక్ హౌసెస్, డూప్లెక్స్ హౌసెస్, విల్లాస్ లభిస్తాయని తెలిపారు. సోలార్ ఫెన్సింగ్‌తో కాంపౌండ్ వాల్, సెంట్రల్ మీడియన్, డిజైనర్ లాండ్ స్కేప్‌తో విశాలమైన రోడ్లు, కిడ్స్ పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, థీమ్ పార్కులు, ఓవర్‌హెడ్ ట్యాంకులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడుసుమిల్లి కిశోర్‌బాబు, చెంచు గరటయ్య సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్ రాజు, ఎంపీకే లక్ష్మీపతిరాజు, కోట శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, చెన్నంశెట్టి సతీష్‌బాబు, కల్వకోట సాయిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

బేస్తవారిపేట/ కంభం: గిద్దలూరు నియోజకవర్గంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం రెండు బెల్‌షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్థవీడు మండలంలోని గన్నెపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సుదర్శన్‌యాదవ్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం అందడంతో తనిఖీ చేయగా 100 క్వార్టర్ బాటిళ్లు లభించాయని వివరించారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నా, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా సమాచారం అందించాలని ఎస్సై కోరారు.



గన్నెపల్లెలో సీజ్ చేసిన మద్యంతో ఎస్సై సుదర్శన్‌యాదవ్

చిన్న కంభంలో..

కంభం మండలంలోని చిన్న కంభంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి.నరసింహారావు ఆదివారం తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం రావడంతో దాడి చేయగా 40 క్వార్టర్ బాటిళ్లు, 3 ఫుల్ బాటిళ్లు లభించాయని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చిన్న కంభంలో సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎస్సై నరసింహారావు